


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
10-10-2025
పేజీలు: 02



## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

ఫిలిప్పీన్స్‌ను భారీ భూకంపం వణికించింది. మిండనావో ప్రాంతంలోని మనాయ్ పట్టణం వద్ద సముద్రంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. దీన్ని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైంది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేసి.. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.భారీ భూకంపం నేపథ్యంలో సునామీ హెచ్చరికలు జారీ చేసింది. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. కాగా, పసిఫిక్ తీరంలో భారీగా అలలు ఎగసిపడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

# మరోసారి హైడ్రా దూకుడు.. బంజారాహిల్స్‌లో కూల్చివేతలు


నగరంలో హైడ్రా మరోసారి దూకుడు పెంచింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువులను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్న హైడ్రా.. తాజాగా భాగ్యనగరంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో కూల్చివేతలు చేపట్టింది. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో 5 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈరోజు (శుక్రవారం) హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సుమారు రూ.750 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. తెల్లవారుజాము నుంచే భారీ పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా సిబ్బంది కూల్చివేతలు చేపట్టింది. దాదాపు రూ.750 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారు. తప్పుడు పత్రాలు, సర్వే నెంబర్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడ్డారు. దీనిపై హైడ్రాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీంతో హైడ్రా ముందుకు వచ్చి కూల్చివేతలు చేపట్టింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడింది హైడ్రా. ఈ ఐదు ఎకరాల స్థలంలో జలమండలికి 1.2 ఎకరాలను గతంలో ప్రభుత్వం కేటాయించింది. అయితే ఓ వ్యాపారి ఆ స్థలాన్ని కబ్జా చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా.. ఆ స్థలంలో వేసిన షెడ్లను నేలమట్టం చేసింది. ఐదు ఎకరాల చుట్టూ కూడా ఫెంక్షన్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది హైడ్రా. మరోవైపు రంగారెడ్డి జిల్లాలో కూడా హైడ్రా దూకుడు పెంచింది. పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో 700 గజాల ప్రభుత్వ పార్క్ స్థలాన్ని హైడ్రా కాపాడింది. కాలనీలోని పార్క్ స్థలాన్ని బీఆర్ఎస్ నేత గతంలో కబ్జాకు పాల్పడ్డారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగి.. 700 గజాల పార్క్ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది.






## బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్తాం

బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని, స్థానిక ఎన్నికలకు వెళ్లే ముందు బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు మేలు చేయడాన్ని భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారి కులగణన తమ ప్రభుత్వమే చేసిందని ఆయన పేర్కొన్నారు.



## AI జనరేటెడ్ వీడియోలపై నిషేధం

అన్ని రకాల AI-జనరేటెడ్ వీడియోల వాడకంపై భారత ఎన్నికల కమిషన్ (ECI) కఠినమైన నిషేధాన్ని ప్రకటించింది. ఈ నిర్ణయం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏవైనా సంస్థలకు వర్తిస్తుంది. ఓటర్లను ప్రభావితం చేయడానికి లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి AI-జనరేటెడ్ కంటెంట్‌ను ఉపయోగించడం మోడల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణించబడుతుందని కమిషన్ చెప్పింది. రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తప్పుడు సమాచారాన్ని అరికట్టే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది.ఏ అభ్యర్థి కూడా తమ ప్రత్యర్థులపై ప్రచారం చేయడానికి AI వీడియోలను ఏ రూపంలోనూ ఉపయోగించకూడదని కమిషన్ పేర్కొంది. నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ఆదేశం వచ్చింది. నవంబర్ 14న ఫలితాలు వెల్లడిస్తారు. రాజకీయ ప్రచారాలలో కృత్రిమ మేధస్సు దుర్వినియోగాన్ని నిరోధించడం, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూడటం ఈ నిషేధ లక్ష్యం అని EC తెలిపింది. AI లేదా సింథటిక్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు రాజకీయ పార్టీలు మోడల్ ప్రవర్తనా నియమావళి (MCC)ని పాటించాలని సూచించారు. సోషల్ మీడియా లేదా ఇంటర్నెట్‌లో అభ్యర్థులు, పార్టీలు పంచుకునే అన్ని కంటెంట్ ఇప్పుడు ఈ మార్గదర్శకాల పరిధిలోకి వస్తుంది. సమాచారాన్ని తారుమారు చేయడానికి లేదా ఓటర్లను తప్పుదారి పట్టించడానికి AI సాధనాలను ఉపయోగించరాదని కమిషన్ నొక్కి చెప్పింది

## తెలంగాణ T-Fiberకు జాతీయ గుర్తింపు

### రోల్ మోడల్‌గా ప్రశంసలు

తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న T-Fiber పైలట్ విలేజ్ ప్రోగ్రామ్ ఇప్పుడు జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. 2025 ఇండియా మొబైల్ కాంగ్రెస్ (IMC) సందర్భంగా ఢిల్లీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో, ఈ ప్రాజెక్ట్‌ను ఇతర రాష్ట్రాలకూ రోల్ మోడల్‌గా కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ ప్రకటించింది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, "తెలంగాణ T-Fiber ప్రాజెక్ట్ దేశవ్యాప్తంగా అనుసరించదగ్గ మోడల్" అని ప్రశంసించారు. తెలంగాణ ఐటీ & పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ పాత్రను వివరిస్తూ, వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ ఎలా గ్రామీణ ప్రజల జీవనశైలిని మార్చిందో వివరించారు.T-Fiber పైలట్ ప్రోగ్రామ్ ప్రధానంగా చిన్న గ్రామాల వరకూ హై-స్పీడ్ ఫైబర్ ఆప్టిక్ ఇంటర్నెట్‌ను చేరవేయడమే లక్ష్యంగా రూపొందించబడింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఇంటికి, ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం అందించబడుతోంది. నగరాల్లో లభించే డిజిటల్ వనరులు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ సమానంగా అందుతున్నాయి. అంతేకాక, ఈ ప్రాజెక్ట్ డిజిటల్ సమానత్వాన్ని కల్పిస్తూ, గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు, విద్య, ఉపాధి, ఆరోగ్యసేవలు, ఆన్‌లైన్ వ్యాపార అవకాశాలను సులభంగా అందుబాటులోకి తీసుకొస్తోంది.ప్రారంభంలో కొన్ని ఎంపిక గ్రామాల్లో అమలైన ఈ పైలట్ ప్రోగ్రామ్ ఆశాజనక ఫలితాలు ఇచ్చినందున, ప్రస్తుతం మరిన్ని గ్రామాలకు విస్తరించబడుతోంది. ఇది ఇతర రాష్ట్రాల దృష్టినీ ఆకర్షించడంతో, కేంద్రం కూడా మరిన్ని రాష్ట్రాల్లో ఈ మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. IT మంత్రుల రౌండ్ టేబుల్ సమావేశంలో, మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, భారత్‌నెట్ అమలును వేగవంతం చేయడం, Right of Way (RoW) అనుమతుల సమస్యలను పరిష్కరించడం, అలాగే డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రక్షణ కోసం సైబర్ సెక్యూరిటీ విధానాలను బలోపేతం చేయడం వంటి అంశాల్లో రాష్ట్రం కేంద్రమంత్రిత్వ శాఖతో కలిసి పనిచేస్తోందన్నారు.ఈ ప్రాజెక్ట్ గ్రామీణ జీవనశైలిలో డిజిటల్ మార్పులకు దోహదపడుతోంది. ప్రజలు ఇంటి వద్ద నుంచే విద్యా కోర్సులు చదవడం, ఉద్యోగ అవకాశాలు అన్వేషించడం, ప్రభుత్వ సేవలు పొందడం, ఆరోగ్య సలహాలు తీసుకోవడం, అలాగే తమ స్వంత ఆన్‌లైన్ వ్యాపారాలను ప్రారంభించడం వంటి మార్పులు చోటు చేసుకున్నాయి.
ఈ ప్రాజెక్ట్ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, విద్యా, సాంకేతిక అభివృద్ధికి ఒక దిశానిర్దేశకంగా మారింది.సమగ్రంగా చూసుకుంటే, T-Fiber గ్రామీణ డిజిటల్ లైఫ్‌ను మార్చగల సామర్థ్యాన్ని చూపించింది. ఇది "లాస్ట్ మైల్ కనెక్టివిటీ"కి ఒక విజయవంతమైన నమూనాగా నిలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ మరిన్ని రాష్ట్రాలకు విస్తరించి, దేశవ్యాప్తంగా గ్రామీణ అభివృద్ధికి బలమైన సాంకేతిక పునాది కాబోతుందని కేంద్రం భావిస్తోంది.




## జలమండలికి ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ అవార్డు

జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ అవార్డు, ఉత్తమ ఎస్టీపీ, ఉత్తమ యాజమాన్య అవార్డ్ లాంటి వాటిని గెలుచుకోగా.. తాజాగా మరొక అవార్డును తన ఖాతాలో వేసుకుంది. తమ సంస్థలో ఆర్‌టిఐ కేసుల్లో ఉత్తమంగా పనిచేసిన గానూ తెలంగాణ సమాచార కమిషన్ ఉత్తమ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ పురస్కారాన్ని ప్రకటించింది.ఈ అవార్డును జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రవీంద్ర భారతిలో గౌరవ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా గురువారం అందుకున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉన్నతాధికారులు, ఉగ్యోగులు పాల్గొన్నారు.



## ఇతరుల కోసం అస్సలు బతకొద్దు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న రౌడీ హీరో విజయ్ దేవరకొండల మధ్య ఎంగెజ్ మెంట్ జరిగింది.ఈ క్రమంలో కొద్ది మంది సన్నిహితుల మధ్య వేడుక గ్రాండ్ గా నిర్వహించారని సమాచారం. మరోవైపు పుట్టపర్తికి విజయ్ వెళ్లినప్పుడు ఆయన చేతికి రింగ్ కూడా కన్పించింది. ఇది పక్కా నిశ్చితార్థం రింగ్ అని ప్రచారం జరిగింది. మరోవైపు పుట్టపర్తి నుంచి తిరిగి వస్తుండగా విజయ్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ప్రమాదంకు గురైంది. కొంత మంది రష్మికను ఎంగెజ్ మెంట్ చేసుకోవడం వల్లనే గండం తప్పిందని చెప్తుంటే, మరికొంత మంది మాత్రం రష్మిక వల్ల విజయ్ కు ప్రమాదం ఉందని కూడా లేని పోనీ రూమర్స్ వైరల్ చేశారు. అదే విధంగా ఇటీవల కాంతారా మూవీ విషయంలో రష్మిక చేసిన వ్యాఖ్యలతో కన్నడ ఇండస్ట్రీ రష్మిక మూవీస్ ను బ్యాన్ చేశారని నెట్టింట వార్తలు తెగ హల్ చల్ చేశాయి. అయితే.. ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమ తనను నిషేధించిందంటూ జరుగుతున్న ప్రచారంపై రష్మిక మందన్న రియాక్ట్ అయ్యారు. తన నెక్ట్స్ మూవీ థామా మూవీ ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు.ఈ నేపథ్యంలో మాట్లాడుతూ.. కన్నడ పరిశ్రమ తనపై బ్యాన్ విధించిందన్న వార్తలను రష్మిక ఖండించారు.



# హైదరాబాద్‌లో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..

# రూ.72 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్! నలుగురు అరెస్ట్

నగరంలో మత్తు మాఫియా రెచ్చిపోతుంది. తాజాగా వెలుగు చూసిన జీడిమెట్ల డ్రగ్స్ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గత కొంత కాలంగా డ్రగ్స్ తయారు చేస్తున్న కేంద్రాలపై ఈగల్ టీం ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా జీడిమెట్ల లో రూ. 72కోట్ల విలువైన డ్రగ్స్ పోలీసులు గురువారం (అక్టోబర్ 9) పట్టుకున్నారు. 220కిలోల ఎపిడ్రిన్ డ్రగ్ స్వాధీనం చేసుకోగా మరో నలుగురిని అరెస్ట్ చేశారు. ఒకరు పరారీ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ ను తయారు చేసి ముంబైకి తరలించేందుకు ప్రయత్నం చేశారు. పక్కా సమాచారంతో ఈగల్ టీం దాడి చేసి, నిందితులను పట్టుకున్నారు. నిందితులు- - - శివరామకృష్ణ, అనిల్, దొర బాబు, వెంకటకృష్ణారావు, ప్రసాద్‌గా గుర్తించారు. గతంలో రెండు సార్లు- - - బెంగుళూరు, హైదరాబాద్ ఎన్సీబీకు శివరామకృష్ణ పట్టుబడ్డాడు. అన్నదమ్ములు వెంకట కృష్ణారావు, ప్రసాద్ IDA బొల్లారంలో ఉన్న PNM లైఫ్ సైన్సెస్ కంపెనీకి ఓనర్స్ గా ఉన్నారు. స్వామి అనే ఫ్రెండ్ సహాయంతో పిఎన్ఎం లైఫ్ సైన్సెస్ కు శివరామకృష్ణ వెళ్లాడు. కంపెనీలో కాకినాడకు చెందిన అనిల్ తో శివరామకృష్ణకు పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత నిందితులు అనిల్, శివరామకృష్ణ ఇద్దరూ కలిసి మెఫేడ్రిన్ డ్రగ్స్ దందాకు తెరలేపారు. PNM కంపెనీలో ప్రొడక్షన్ మేనేజర్ గా పనిచేస్తున్న అనిల్.. శివరామకృష్ణ ఇచ్చిన ఫార్ములా తో 220 కిలోల డ్రగ్స్ తయారీ చేశాడు. డ్రగ్స్ తయారు చేసినందుకు గాను రూ.8 లక్షలు శివరామకృష్ణకు ఇచ్చాడు. డ్రగ్స్ తయారీకి కంపెనీలోని రియాక్టర్స్ ను అనిల్ కు వెంకటకృష్ణ రావు, ప్రసాద్ ఇచ్చారు. డ్రగ్స్ తయారీ తర్వాత జీడిమెట్ల లోని శివరామకృష్ణ నివాసానికి తరలించేవారు. ఇందుకు సంబంధించి పక్కా సమాచారం అందడంతో భారీ డ్రగ్స్ కేసును ఈగల్ అధికారులు చేదించారు. నగరంతో సహా ముంబై, గోవా ప్రాంతాలకు డ్రగ్స్ తరలించాలని భావించిన నిందితుల ప్లాన్ బూడిదైంది. దీంతో రంగంలోకి దిగిన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బృందాలు వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నారు.





## వయోవృద్ధుల దర్శనంపై టీటీడీ క్లారిటీ

తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలనుకునే వయోవృద్ధుల దర్శనంపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది. సీనియర్ సిటిజన్స్ ఫ్రీ దర్శనంపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని భక్తులకు టీటీడీ మరోసారి విజ్ఞప్తి చేస్తోంది. వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించేలా కొన్ని వార్తలు సోషల్ మీడియాలో గత కొంతకాలంగా చక్కర్లు కొడుతుండడంతో ఇవి పూర్తిగా అవాస్తవమని ప్రకటన ఇచ్చింది. వాస్తవం ఏమిటో భక్తులకు వివరించింది.ప్రతిరోజు 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ. 50 ఒక లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్/పీహెచ్‌సీ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. కాబట్టి సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు వార్తలను, వదంతులను నమ్మవద్దని టీటీడీ భక్తులకు సూచించింది. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org, https://ttdevastanams.ap.inను మాత్రమే సంప్రదించాలని కోరుతోంది.




## ఎన్నికల నోటిఫికేషన్‌పై ఈసీ సస్పెన్షన్ స్థానిక ఎన్నికలపై అసంతృప్తి

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న MPTC, ZPTC ఎన్నికల సంబంధించి గెజిట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.సెప్టెంబర్ 29న విడుదలైన ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు నేపథ్యంలో, ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు అధికారికంగా ప్రకటించింది.హైకోర్టు ఆదేశాలు అందిన వెంటనే, ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ కమిషన్ ప్రత్యేక గెజిట్‌ను విడుదల చేయనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కూడా తాత్కాలికంగా రద్దు చేయనున్నారు.ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలా లేదా అన్నది, హైకోర్టు తుది ఆదేశాలపై ఆధారపడి ఉంటుందని, తదుపరి నిర్ణయం కోర్టు తీర్పు అనంతరం తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.ఈ పరిణామాలతో రాష్ట్రవ్యాప్తంగా జోరుగా నడుస్తున్న ఎన్నికల హడావుడికి కొంత విరామం లభించినట్లయ్యింది.

# ముంచుకొస్తున్న మరో అల్పపీడనం

దక్షిణ ఒడిశా నుండి కోస్తా ఆంధ్ర తీరం రాయలసీమ తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్రమట్టం నుండి 0.9 కి మీ ఎత్తులో ద్రోణి కొనసాగుతుంది. దీని ప్రభావంతో తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట మహబూబాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.రేపు కూడా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు తెలంగాణ, ఏపీ మీదుగా కొనసాగుతున్న ద్రోణికి ఉపరితల ఆవర్తనం తోడైంది. దీని ప్రభావంతో అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడి రేపటికి (అక్టోబర్ 11) అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో వచ్చేవారం మళ్లీ కుండపోత వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. కాగా గడచిన 24గంటల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి పల్లిలో అత్యధికంగా 9.15 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత మల్కలపల్లిలో 7.55 సెంటీ మీటర్లు, నల్లగొండ జిల్లా తిప్పర్తి 6.78 సెంటీ మీటర్లు,



కట్టంగూరులో 5.07 సెంటీ మీటర్లు, నార్కెట్‌పల్లిలో 4.76 సెంటీ మీటర్లు, మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో 4.71 సెంటీ మీటర్లు, భూత్పూర్‌లో 4.59 సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



## విజయ్‌కు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ తీవ్ర హెచ్చరికలు జారీ

తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌కు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల 41 మంది మృతికి కారణమైన తొక్కిసలాట జరిగిన కరూర్ ప్రాంతానికి విజయ్ మళ్లీ వెళితే ఆయన ప్రాణాలకు ప్రమాదం తప్పదని సంచలన వ్యాఖ్యలు చేశారు. బాధితులను పరామర్శించేందుకు విజయ్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.తిరునల్వేలిలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన నాగేంద్రన్, "విజయ్ ఇప్పుడు కరూర్ వెళితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. ఆయన ప్రాణాలకు భద్రత ఉండదు. కరూర్ సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది నలిగిపోయి చనిపోయారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని విజయ్ ఇప్పటికే పోలీసుల రక్షణ కోరుతూ ఫిర్యాదు కూడా చేశారు" అని తెలిపారు. సెప్టెంబర్ 27న జరిగిన ఈ దుర్ఘటన తర్వాత బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు విజయ్ తన బృందం ద్వారా పోలీసుల అనుమతి కోరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ అభ్యర్థనను పరిశీలించాలని డీజీపీ కార్యాలయం జిల్లా ఎస్పీకి సూచించినట్లు సమాచారం.ఈ సందర్భంగా డీఎంకే ప్రభుత్వంపై నాగేంద్రన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధితులకు అండగా నిలవాల్సింది పోయి, వారిపైనే కేసులు పెట్టడం డీఎంకే ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. "ప్రభుత్వ మార్పు కోసం తమిళనాడు ప్రజలు ఏకమవుతున్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి అనేక రాజకీయ శక్తులు ఒకే గొడుగు కిందకు వస్తాయి" అని ఆయన అన్నారు.



## ఐటీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు పెండింగ్ ప్రోత్సాహకాలు

వెంటనే చెల్లించాలని నిర్ణయం



ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన సంస్థలకు పూర్తి భరోసా కల్పిస్తామని, ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టార్టప్ ల వృద్ధిలో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ ను మరింత సమర్థంగా తీర్చిదిద్దాలని, మరో రెండు నెలల్లో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వెయ్యి సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు నిర్దేశించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీపైనా సమావేశంలో చర్చించారు. రేపటి కేబినెట్ సమావేశంలో క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రవేశపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్, ఇన్నోవేషన్ సొసైటీ, స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ పైనా సమావేశంలో చర్చించారు.రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు ఆయా పరిశ్రమలతో నిత్యం సంప్రదింపులు జరపాలని ఈడీబీ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు వచ్చిన పెట్టుబడులు, ఆయా పెట్టుబడుల ప్రస్తుత స్థితిపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో గూగుల్, సత్వా, టీసీఎస్, ఏఎన్ఎస్ఆర్ వంటి కంపెనీలు త్వరితగతిన తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్లస్టర్ వారీగా పరిశ్రమల స్థాపనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యం అని, ఇందుకు టాప్-100 డెవలపర్స్, ఐటీ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని అధికారులను మంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి.సుందర్, ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ, ఎస్పీ మల్లికా గార్గ్, ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ గీతాంజలి శర్మ, ఆర్టీఐహెచ్ సీఈవో పి.ధాత్రి రెడ్డి, ఆర్టీజీఎస్ అడిషనల్ సీఈవో సౌర్యమాన్ పటేల్, ఈడీబీ సీఈవో శశికాంత్ వర్మ, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, జీఎం విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.



## తమన్నా హాట్ లుక్స్

తమన్నా భాటియా గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీ, హ్యాపీడేస్‌లాంటి చిన్న సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే బడా హీరోలందరితో నటించి అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. దశాబ్దంపైగా దక్షిణాది ప్రేక్షకులను తన అందచందాలు, అభినయంతో మెప్పించింది ఈ మిల్కీ బ్యూటీ. కొంతకాలంగా దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. ప్రస్తుతం పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది. తాజాగా తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రముఖ హారర్ బోల్డ్ ఫ్రాంచైజీ 'రాగిణి MMS' సిరీస్‌లో హీరోయిన్‌గా ఎంపికైందని సమాచారం. ఫిలీం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న వార్త ప్రకారం.. ఈ హారర్-థ్రిల్లర్ ప్రాజెక్ట్ కోసం 'ఏక్తా కపూర్' స్వయంగా తమన్నాను సంప్రదించారట. కథ, పాత్ర, అన్నీ విన్న తర్వాత తమన్నా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది.